ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
గురువారం 12 సెప్టెంబరు 2024



రేస్‌కోర్స్ స్థలంలో కొత్త అసెంబ్లీ, సచివాలయం?

సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం కసరత్తు

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి రేస్‌కోర్స్ మైదానంలో కొత్త అసెంబ్లీ, సచివాలయం నిర్మించడంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నగరంలో అత్యంత ప్రాధానత కలిగిన ప్రాంతాల్లో గిండి రేస్‌కోర్సు మైదానం ఒకటి. గుర్రపు పందేలు జరిగే ఆ స్థలం రాష్ట్ర ప్రభుత్వానికి చెందినది. 160 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన ఆ స్థలాన్ని 1946లో అప్పటి ప్రభుత్వం రేస్‌కోర్స్ క్లబ్‌కు లీజుకు ఇచ్చింది. ప్రతియేటా రూ.614ను ప్రభుత్వానికి అద్దె చెల్లించేలా ఆ ఒప్పందంలో పేర్కొన్నారు. 1970లో రేస్‌కోర్సు స్థలానికి అప్పటి భూముల విలువ ఆధారంగా అద్దె పెంచి చెల్లించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను క్లబ్ నిర్వాహకులు నిరాకరించారు. భవిష్యత్తులో అద్దె పెంచి ప్రభుత్వానికి చెల్లించాలనే నిబంధనలు ఏవీ ఒప్పందంలో లేవని క్లబ్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఆ వాదనను తిరస్కరించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.730 కోట్ల మేర అద్దె చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ క్లబ్ నిర్వాహకులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ప్రభుత్వానికి సానుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో కొద్ది రోజుల క్రితం ప్రభుత్వ అధికారులు ఆ రేస్‌కోర్సు ప్రాంతానికి సీలు వేశారు. క్లబ్‌నిర్వాహకులు అప్పీలుకు వెళ్లనున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఆ సీలు తొలగించింది. ఇదిలా ఉండగా హైకోర్టు ఉత్తర్వులనే ఉన్నత న్యాయస్థానాలు కూడా ఖరారు చేస్తాయని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. రేస్‌కోర్స్ స్థలం త్వరలోనే ప్రభుత్వ వశమవుతుందని చెబుతున్నారు. అదే జరిగితే డీఎంకే ప్రభుత్వం అక్కడ కొత్త అసెంబ్లీ, సచివాలయ భవనం నిర్మించేందుకు చర్యలు ప్రారంభిస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అసెంబ్లీ, సచివాలయం ఉన్న ప్రాంతాలు భారత సైన్యానికి చెందినవి. అద్దె ప్రాతిపదికన ప్రభుత్వం అసెంబ్లీ, సచివాలయాన్ని నిర్వహిస్తోంది. అసెంబ్లీ భవనం శిథిలావస్థకు చేరడం, విశాలంగా లేకపోవడం వల్లనే మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఓమందూరార్ ప్రభుత్వ ఎస్టేట్ ప్రాంతంలో కొత్త అసెంబ్లీ, సచివాలయ భవనాలను నిర్మించారు. మూడుసార్లు ఈ కొత్త అసెంబ్లీలో సమావేశాలు కూడా నిర్వహించారు. ఆ తర్వాత అన్నాడీఎంకే అధికారంలోకి రావటం, అప్పటి ముఖ్యమంత్రి జయలలిత అసెంబ్లీ సమావేశాలు సెయింట్ జార్జికోటలోనే జరుగుతాయని ప్రకటించి, డీఎంకే ప్రభుత్వం నిర్మించిన అసెంబ్లీ భవనసముదాయంలో ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయడం జరిగిపోయాయి. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం ఓమందూరార్ ఎస్టేట్ ప్రాంతంలో నడుపుతున్న ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని గిండి వద్ద కొత్తగా నిర్మించిన ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంతానికి తరలించాలని నిర్ణయించింది. ఏ కారణాల వల్లనో అది అమలుకు నోచుకోలేదు. ఈ పరిస్థితుల్లో 160 ఎకరాల విస్తీర్ణం కలిగిన రేస్‌కోర్స్ మైదానంలో కొత్త అసెంబ్లీ, సచివాలయ భవనాలను నిర్మించాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ భావిస్తున్నట్లు సమాచారం. దీనికోసం సాధ్యాసాధ్యాలపై కసరత్తు చేయాలని ఆయన అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చే అవకాశముంది.

పాంబన్ రైల్వే వంతెన సిద్ధం

- 2న ప్రధాని చేతులమీదుగా ప్రారంభం




చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా పాంబన్ వద్ద రూ.535 కోట్లతో నిర్మించిన రైల్వే వంతెన పనులు ఈ నెలాఖరులో పూర్తికానున్నాయి. దీంతో అక్టోబరు 2న ప్రధాని నరేంద్రమోదీ ఈ వంతెనను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో ఆగ్నేయ దిశగా బంగాళాఖాతంలో పాక్ జలసంధి ప్రాంతంలో పాంబన్ రైల్వే వంతెన ఉంది. రామేశ్వరం దీవిని భారత భూభాగంతో కలిపుతూ 1914లో ఆ రైల్వే వంతెన ప్రారంభించారు. రైల్వే వంతెన దిగువన పడవలు, నౌకలు సులువుగా వెళ్లేలా వంతెన మధ్యలో పట్టాలు ఇరువైపులా పైకి లేచే విధంగా హైడ్రాలిక్ లిఫ్ట్‌యంత్రాలు ఏర్పాటు చేశారు. 2.05 కి.మీల. పొడవైన ఈ రైల్వే వంతెన దేశంలోనే అతి పొడవైనదిగా పేరుగడించింది. 1964లో పాంబన్ దీవిలో భారీ తుఫాన్ కారణంగా రైల్వే వంతెన బాగా దెబ్బతింది. ఆ తర్వాత రైల్వే ఇంజనీరింగ్ సాంకేతిక నిపుణులు ఆ వంతెనకు మరమ్మతులు చేశారు. 1988లో పాంబన్ రైల్వే వంతెనకు చేరువగా పొడవైన రహదారి వంతెన నిర్మించారు. అప్పటివరకూ మండపం ప్రాంతానికి రామేశ్వరానికి రైల్వే వంతెనే ప్రధాన రహదారిగా ఉండేది. ప్రస్తుతం ఈ రైల్వే వంతెన 110 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో తరచూ స్థిరత్వాన్ని కోల్పోతున్నట్లు అధికారులు గమనించారు. రైల్వే వంతెనలో కొన్ని చోట్ల బీటలు వారాయి. ఈ పరిస్థితుల్లో పాత వంతెనకు పక్కనే కొత్తగా రైల్వే వంతెన నిర్మించేందుకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. తొలివిడతగా రూ.250 కోట్లు విడుదల చేసి, 2019 మార్చి ఒకటి ప్రధాన నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఆగస్టు11న భూమి పూజతో ఎనులు ప్రారంభయ్యాయి. అప్పట్లో 2021 సెప్టెంబర్‌లోగా ఈ కొత్త రైల్వే వంతెన నిర్మాణం పూర్తవుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే పాంబన్ సముద్ర ప్రాంతంలో తరచూ ఏర్పడే అలల ఉధృతి, తుఫాన్లు తదితర వాతావరణ మార్పులు, ఇవే కాకుండా కరోనా లాక్‌డౌన్ తోడవటంతో నిర్దేశిత కాలంలోగా రైల్వే వంతెన పనులు పూర్తికాలేదు. ప్రాజెక్టు ప్రణాళికా వ్యయం కూడా రూ.535 కోట్లకు పెరిగింది. రైల్ వికాస్ నిగమ్ సంస్థ ఈ రైల్వే వంతెన నిర్మాణ పనులు చేపట్టింది. అదే సమయంలో పాత పాంబన్ రైల్వే వంతెనలో నౌకలకు దారివిడిచే ప్రాంతం వద్ద లిఫ్ట్ యంత్రాల్లో సాంకేతిక లోసం ఏర్పడటంతో 2023 డిసెంబర్ నుంచి రామేశ్వరానికి రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. రామేశ్వరానికి వెళ్లే రైళ్లన్నింటినీ మండపం, రామనాథపురం వరకు మాత్రమే నడుపుతున్నారు. కొత్తగా నిర్మించిన పాంబన్ రైల్వే వంతెన పొడవు 2.078 మీటర్లు. సముద్రంలో 333 కాంక్రీట్ పునాదులు నిర్మించారు. 101 స్తంభాలతో ఈ రైల్వే వంతెన నిర్మాణం త్వరలో పూర్తికానుంది. ఈ కొత్త రైల్వేవంతెనపై ఒకే సారి రెండువైపులా రైళ్లు నడిచేలా డబల్ ట్రాక్ వేస్తున్నారు. ప్రస్తుతం పట్టాల ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ రైల్వే వంతెన దిగువగా నౌకలు, పడవలు సులువుగా వెళ్లేందుకు వీలుగా వంతెన మధ్యలో 27 మీటర్ల ఎత్తుతో హైడ్రాలిక్ లిఫ్ట్ యంత్రాలు కూడా అమర్చారు. ఈ రైల్వే వంతెనపై అక్టోబర్ 2 నుండి రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్ ప్రకటించారు. కాగా అక్టోబర్ 2వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ ఈ రైల్వే వంతెనను ప్రారంభిస్తారని కేంద్రప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆ మేరకు అధికారికంగా ప్రకటన వెలువడాల్సి వుంది.

డీపీఐ ఆహ్వానంపై ఏం చేద్దాం?

- అన్నాడీఎంకే సతమతం!
- సీనియర్లతో ఈపీఎస్ మంతనాలు

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ అనుబంధ సంస్థ నిర్వహించనున్న మద్యపాన వ్యతిరేక మహానాడుకు రావాలంటూ డీపీఐ ఇచ్చిన ఆహ్వానంపై ఎలా స్పందించాలో తెలియక అన్నాడీఎంకే సతమతమైపోతోంది. డీఎంకే కూటమిలో వున్న డీపీఐ ఆహ్వానాన్ని అంగీకరిస్తే కార్యకర్తలకు ఎలాంటి సంకేతాలు వెళ్తాయి?.. ఒకవేళ ఆ మహానాడుకు వెళ్తే మద్య నిషేధానికి తాము అంగీకరించినట్లవుతుందా?.. ఒకవేళ భవిష్యత్తులో తాము అధికారం చేపడితే మద్యపాన నిషేధం చేయాల్సివస్తుందా? అన్నదానిపై ఆ పార్టీ సీనియర్లు సమాలోచనలు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ 2026లో జరిగే శాసనసభ ఎన్నికలపై దృష్టిసారిస్తున్నాయి. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, డీపీఐ, సీపీఐ, సీపీఎం, ఎండీఎంకే తదితర పార్టీలున్నాయి. అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకే మినహా పెద్ద పార్టీలేవీ లేవు. దీంతో శాసనసభ ఎన్నికల్లోగా ఓటు బ్యాంక్ ఉన్న పార్టీలను తమ కూటమిలో చేర్చుకునేందుకు ఈపీఎస్ ఇప్పటికే పావులు కదుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో డీఎంకే మిత్రపక్షమైన డీపీఐ అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా కళ్లకుర్చిలో మద్యనిషేధ, మాదకద్రవ్యాల నిరోధక మహానాడు జరుపతలపెట్టింది. ఆ మహానాడులో పాల్గొనాలని మద్యనిషేధానికి గట్టి మద్దతునిస్తున్న అన్నాడీఎంకేకు, కొత్తగా రాజకీయ ప్రవేశం చేసిన నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రికళగంకు ఆహ్వానించింది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం సృష్టించింది. శాసనసభ ఎన్నికల్లోగా ప్రధాన కూటముల్లో భారీగామార్పులు జరుగుతాయని, ఆ మేరకు డీఎంకే కూటమి నుంచి డీపీఐ వైదొలగాలని సిద్ధమవడం వల్లనే అన్నాడీఎంకేకు ఆహ్వానం పలికిందన్న విశ్లేషణలూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో డీపీఐ మహానాడులో పాల్గొనే విషయమై ఈపీఎస్ సీనియర్ నేతలతో చర్చలు జరుపుతున్నారు. ఈ విషయమై అన్నాడీఎంకే సీనియర్ నాయకుడొకరు మాట్లాడుతూ.. మద్యనిషేధ మహానాడులో పాల్గొనమంటూ డీపీఐ నేత్ తిరుమావళవన్ తమ పార్టీని ఆహ్వానించడం హర్షణీయమేనన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మద్యనిషేధం అమలులో భాగంగా 500 టాస్మాక్ దుకాణాలను మూసివేయించారని, ఆమె బాటలోనే ఈపీఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా 500 మద్యం దుకాణాలను మూసివేస్తూ ఉత్తర్వులిచ్చారని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం మద్యనిషేధ మహానాడులో పాల్గొనమంటూ తిరుమావళవన్ ఆహ్వానించడం ముదావహమన్నారు. ఆ మహానాడులో అన్నాడీఎంకే తప్పకుండా పాల్గొనే అవకాశం ఉందన్నారు. దీనిపై తమ పార్టీ నేతలు ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. ఇది కొత్త కూటమికి దారి తీస్తుందన్న ఊహాగానాలను కూడా తాము కొట్టిపారేయలేమని, భవిష్యత్తు రాజకీయాల్లో ఏదైనా జరగవచ్చని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు.





కార్ల ఉత్పత్తిని మళ్లీ ప్రారంభించండి

- ఫోర్డ్ మోటర్ ప్రతినిధులకు స్టాలిన్ వినతి

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో మళ్లీ కార్ల ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఫోర్డ్ మోటర్స్ యాజమాన్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఆ సంస్థ ఆధ్వర్యంలోని అంతర్జాతీయ నైపుణ్య కేంద్రం సేవలను విస్తరింపజేయాలని కూడా కోరారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో, చికాగో నగరాల్లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఇప్పటి వరకు రూ.7016 కోట్ల విదేశీ పెట్టుబడులను సేకరించేలా 16 ప్రముఖ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి చికాగో నగరంలో ఫోర్డ్ మోటార్స్, ఐటీ సర్వ్ అలెయన్స్ సంస్థ ప్రతినిధులతో సమావేశమై వాణిజ్యపరమైన చర్చలు జరిపారు. ముందుగా ఫోర్డ్ సంస్థ ఐఎంజీ చైర్‌పర్సన్ కె.హార్ట్, వైస్ చైర్మన్ మేథ్యూ కోట్‌లెవస్కీ, ఫోర్డ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ శ్రీపాద్‌భట్ తదితరులతో స్టాలిన్ సమావేశమయ్యారు. ఆటోమొబైల్ ఉత్పత్తిలో అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతినార్జించిన ఫోర్డ్ సంస్థ తమ రాష్ట్రంలోని కార్ల ఉత్పత్తి కర్మాగారాన్ని మూసివేయడం తనకు తీవ్ర ఆందోళన కలిగించిందని, ప్రస్తుతం మళ్లీ కార్ల ఉత్పత్తికి చర్యలు చేపడితే పారిశ్రామికంగా తమ రాష్ట్రం పురోగమించగలదని ఆయన వివరించారు. ఈ విషయమై త్వరలో సంస్థ ప్రతినిధులందరితోనూ చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామని ఫోర్డ్ సంస్థ అధికారులు స్టాలిన్‌కు భరోసా ఇచ్చారు. అనంతరం నెట్‌వర్కింగ్ సేవలను అందించడంలో పేరుగడించిన ఐటీ సర్వైలన్స్ సంస్థ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్నారు. ఆ సంస్థ నేషనల్ హెడ్ జగదీష్ మొసాలి, డైరెక్టర్లు శివ మూప్పనార్, సంప్ మొువ్వా, చికాగో విభాగం చైర్మన్ సతీష్ యలమంచిలి ఇతర అధికారులతో ఆయన చర్చలు జరిపారు. ప్రతిభావంతులైన యువకులకు ఉపాధి లభించే దిశగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని స్టాలిన్ వారికి విజ్ఞప్తి చేశారు. ఈ రెండు సమావేశాల్లోనూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక, వాణిజ్య శాఖల కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, పారిశ్రామిక మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విజయ్ పార్టీ 6 నెలల్లో మాయం

- మంత్రి దామో అన్బరసన్



చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎవరు రాజకీయాల్లోకి వచ్చినా డీఎంకే శ్రేణులు భయపడాల్సిన అవసరమే లేదని, నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రికళగం పార్టీ మనుగడ ఆరు మాసాలేనని మంత్రి దామో అన్బరసన్ యెద్దేవా చేశారు. మాడంబాక్కంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఎంతోమంది నటీనటులు రాజకీయాల్లోకి వచ్చారని, ప్రస్తుతం వారి పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలిసిన విషయమేనని చెప్పారు. విజయ్ నటించిన సినిమా రెండు రోజులకు మించి ప్రదర్శించడం లేదని, అదే విధంగా ఆయన ప్రారంభించిన రాజకీయ పార్టీ కూడా ఆరు నెలల్లోగా పత్తాలేకుండా పోవడం ఖాయమన్నారు. తన సినిమాలకు వస్తున్న జనాన్ని చూసి విజయ్ పార్టీ ప్రారంభించారన్నారు. ఆరు నెలల తర్వాత తమిళగ వెట్రికళగం అనే సినీ బాక్స్‌ని లోపల పడేయాల్సిందేనని మంత్రి దామో అన్బరసన్ విమర్శించారు.



గాయపడిన జాలర్లను అంబులెన్స్‌లో తరలిస్తున్న వైద్యసిబ్బంది

ఆగని శ్రీలంక నేవీ ఆగడాలు

- గస్తీ నౌకతో పడవను ఢీకొట్టి జాలర్లపై దాడి
- రూ.6.5లక్షల ఆస్తి నష్టం

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా కోడియక్కరై ఆగ్నేయంగా సముద్రంలో చేపలు పడుతున్న నలుగురు జాలర్లపై శ్రీలంక నావికాదళం విరుచుకుపడింది. గస్తీ నౌకతో ఢీకొట్టించి జాలర్ల ఫైబర్ పడవను సముద్రంలో బోల్తాకొట్టించింది. దీంతో ఫైబర్ పడవలోని వలలు, జీపీఎస్ పరికరాలు, సెల్ ఫోన్లు, డీజిల్ సహా మొత్తం రూ. 6.5 లక్షల విలువైన వస్తువులన్నీ కొట్టుకుపోయాయి. ఈ సంఘటనలో గాయపడిన నలుగురు జాలర్లను, అక్కడికి సమీపంలో చేపలు పడుతున్న కొంతమంది జాలర్లు కాపాడి తీరానికి చేర్చారు. నాగపట్టినం జిల్లా సెరుదూరు గ్రామానికి చెందిన ధర్మన్‌కు చెందిన ఫైబర్ పడవలో ఈ నెల 9న అదే ప్రాంతానికి చెందిన శక్తివేల్, దేవరాజ్, కార్తికేయన్, సతీష్ అనే నలుగురు జాలర్లు సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. మంగళవారం సాయంత్రం కొడియక్కరైకి ఆగ్నేయంగా చేపలు పడుతుండగా ఆ ప్రాంతానికి గస్తీ నౌకలో వచ్చిన శ్రీలంక నావికాదళం తమ దేశ సముద్ర జలాల్లో చొరబడ్డారంటూ ఫైబర్ పడవను తమ నైకతో ఢీకొట్టారు. దీంతో సముద్రంలో పడిపోగా, లంక నావికాదళం ఆ జాలర్లను తమ పడవలో ఎక్కించి విచారణ పేరుతో కొట్టి వదలేసి వెళ్లిపోయారు. అదే సమయంలో ఆ ప్రాంతానికి చేరువగా చేపలు పడుతున్న జాలర్లు కొందరు అక్కడికి చేరుకుని బోల్తాపడిన పడవను సరిచేసి, గాయపడిన జాలర్లను తమ పడవలో ఎక్కించుకుని బుధవారం ఉదయం ఒడ్డుకు చేర్చారు. గాయపడిన నలుగురు జాలర్లను అంబులెన్స్‌లో ఒరత్తూరు వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటపై స్థానిక జాలర్లసంఘం నాయకులు పోలీసులకు, సముద్రతీర భద్రతాదళం అధికారులకు ఫిర్యాదు చేశారు.



నీట మునిగిన ఫైబర్ పడవను ఒడ్డుకు చేరుస్తున్న జాలర్లు

సమాచార దర్శిని

వృత్తి పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, సెప్టెంబరు 11: అఖిల భారత వృత్తి పరీక్షకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. వచ్చే ఏడాది జూలైలో హస్తకళ శిక్షణపథకంలో నిర్వహించనున్న ఈపరీక్షకు www.skilltraining.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసి పూర్తిచేసి, రూ.200రుసుము చెల్లించి సర్టిఫికెట్లు నకళ్లుజతపరచి ఉత్తరచెన్నై వృత్తిశిక్షణా కేంద్రంలో ఈనెల 18వ తేదిలోపు సమర్పించాలని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో జరిమానా చెల్లింపులు

ఐసిఎఫ్, సెప్టెంబరు11:ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనచోదకులు జరిమానా చెల్లించేందుకు ఆన్‌లైన్ సేవలను చెన్నై ట్రాఫిక్ విభాగం పరిచయం చేయనుంది. ఈ శాఖ 2011లో ఈ-చలాన్ విధానాన్ని తీసుకువచ్చింది. అనంతరం 2017లో నగదురహిత పరివర్తన ద్వారా రవాణా చలాన్‌కు జరిమానా సులభంగా చెల్లించేలా వివిధ సౌకర్యాలు కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో, https://echallan.taridahan.gov.-in/index/accusedchallan అనే వెబ్‌సైట్‌లో జరిమానా చెల్లింపుతో పాటు చలాన్ నెంబరు, వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ నెంబరు అప్‌లోడ్ వంటి వివిధ సేవలను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు.

81 ప్రాంతాల్లో త్రీడీ బస్ షెల్టర్లు

ఐసిఎఫ్,సెప్టెంబరు11:నగరంలో 81ప్రాంతాల్లో త్రీడీ డిజైన్‌తో బస్‌షెల్టర్లు ఏర్పాటుకానున్నాయి. చెన్నై కార్పొరేషన్ నగరాభివృద్ధికి పలుచర్యలు చేపడుతోంది. ముఖ్యంగా 'సింగార చెన్నై 2.0' పథకం కింద మౌలిక వసతులు కల్పిస్తోంది. ఇందులో భాగంగా కార్పొరేషన్‌లో ఉన్న 1,420 బస్టాప్‌లను ఆధునీకరించాలని నిర్ణయించింది. తొలివిడతగా రూ.12 కోట్లతో 81 ప్రాంతాల్లో త్రీడీ బస్‌షెల్టర్లు ఏర్పాటుచేయనున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రధాన విద్యాధికారుల బదిలీ

ఐసిఎఫ్, సెప్టెంబరు 11: మదురై, కళ్లకుచ్చి జిల్లాల ప్రధాన విద్యాధికారులను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి మధుమతి ఉత్తర్వులు జారీచేశారు. ఈ శాఖలో నిర్వహణ దృష్ట్యా మదురై జిల్లా విద్యాధికారి కార్తిక కళ్లకుర్చి జిల్లా విద్యాధికారిగాను, ఆ జిల్లా విద్యాధికారి మురుగన్ పాఠశాల విద్య డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు.

గ్రీన్‌వేగా చెన్నై బైపాస్

ఐసిఎఫ్, సెప్టెంబరు 11: జాతీయ రహదారుల కమిషన్, అటవీ శాఖ చేపట్టిన చర్యలతో చెన్నై బైపాస్ రోడ్డు గ్రీన్‌వేస్ రోడ్డుగా మారింది. రహదారుల్లో వాహనాల కారణంగా వాయుకాలుష్యం పెరుగుతోంది. దీనిని తగ్గించేలా రెండు కోట్ల మొక్కలు నాటేందుకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ నిర్ణయించింది. ఆ ప్రకారం, రాష్ట్రంలోని వివిధ జాతీయ రహదారుల్లో మొక్కలు నాటే పనులను ఈ శాఖ, అటవీ శాఖ సంయుక్తంగా చేపడుతున్నాయి. పెరుంగళత్తూర్-పుళల్ మధ్య చెన్నై బైపాస్ రోడ్డులో ఈ పనులు 2018లో ప్రారంభమయ్యాయి. ప్రధాన రహదారికిరువైపులా, సర్వీసు రోడ్డు పక్కన మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ఈ మొక్కలు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఏపుగా పెరిగి పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. దీని ద్వారా వాయుకాలుష్యం తగ్గే అవకాశముందని రహదారుల శాఖ అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 11: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా స్థానిక లజ్ ప్రాంతంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పల్లక్కుమన్యం, కబాలితోట్టం, జస్టిస్ సుందరం రోడ్డు, ఈస్ట్ అభిరామపురం 1 నుంచి 3 వీధులు, భాస్కరపురం, రామచంద్ర రోడ్డు,లజ్‌అవెన్యూ 1 నుంచి 4 వీధులు, కృష్ణ అవెన్యూ, లజ్ చర్చి రోడ్డు, వారన్ రోడ్డు, రంగా రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునుందని అధికారులు తెలిపారు.

నేత్రదానం పొందేందుకు కమిటీలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 11: ఆస్పత్రుల్లో మృతిచెందిన వారి నుంచి నేత్రదానం పొందేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేయాలని ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం వంటి వివిధ కారణాలతో కళ్లు పొడిబారడం, కంటి పొర దెబ్బతినడం ద్వారా ఏడాదికి 9వేలమంది వరకు దృష్టి లోపానికి గురవుతున్నారు. నేత్రదానం పొందినప్పటికీ అందరికీ వాటిని అమర్చేందుకు వీలుకావడం లేదు. ఉత్తరాది రాష్ట్రాల వలే తమిళనాడులోను నేత్రదానం కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి లేకపోయినా, అందరికీ చూపు లభించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దీంతో ఒక్కో ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేసి మరణించిన వారి బంధువుల అనుమతితో నేత్రదానం పొందనున్నారు.

రాష్ట్రంలో 6.21 లక్షల గృహాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 11: ప్రధాన మంత్రి గ్రామీణ ప్రాంత గృహ వసతి పథకం కింద రాష్ట్రంలో 6,21,609 ఇళ్లు నిర్మించినట్లు అధికారులు తెలిపారు. 2016లో 'అందరికీ ఇల్లు' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే గృహాలకు ఒక ఇంటికి రూ.1.20 లక్షల నుంచి రూ.1.30 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. ఈ నెల 5వ తేది వరకు రాష్ట్రాల వారీగా నిర్మించిన గృహాల వివరాలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆ ప్రకారం, రాష్ట్రంలో 7,41,469 గృహాల నిర్మాణానికి నిధులు విడుదల చేయగా, అందులో 6.21 లక్షల గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన గృహాల నిర్మాణం త్వరలో ముగుస్తాయని అధికారులు తెలిపారు.

వేళచ్చేరి శ్మశానవాటిక మూసివేత

పెరంబూర్, సెప్టెంబరు 11: మరమ్మతుల కారణంగా వేళచ్చేరి శ్మశానవాటికను గురువారం నుంచి మూసివేస్తున్నట్లు చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. అడయార్ మండలం 172వ వార్డు గురునానక్ కళాశాల సమీపంలో ఉన్న ఈ శ్మశాన వాటిక ఈ నెల 12 నుంచి నెల రోజుల పాటు పనిచేయదని, అప్పటివరకు ఆ ప్రాంత ప్రజలు వేళచ్చేరి తరమణి రోడ్డులోని భారతి నగర్, అలందూర్ మండల పరిధిలోని బాలకృష్ణాపురం శ్మశానవాటికలను వినియోగించుకోవాలని కార్పొరేషన్ తెలిపింది.

రేపటి నుంచి ప్రత్యేక బస్సులు

పెరంబూర్, సెప్టెంబరు 11: వారాంతపు సెలవులు, మిలాదున్ నబి సందర్భంగా నాలుగు రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలిపింది. ఈ మేరకు ఎస్ఈటీసీ విడుదల చేసిన ప్రకటనలో, శుక్ర, శనివారాల్లో కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు 955 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు 13,14 తేదీల్లో 190 ప్రత్యేక బస్సులు నడుపున్నారు. అలాగే, మాధవరం బస్టాండ్ నుంచి శుక్ర, శనివారాల్లో తలా 20 బస్సులు నడుపనున్నారు. అలాగే, నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి 350 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

రామేశ్వరంలో పెనుగాలులు



తీరంలో లంగరు వేసిన పడవలు

చేపల వేటకు వెళ్లని జాలర్లు

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సముద్రతీరంలో అలల ఉధృతి, పెనుగాలులు అధికం కావటంతో గత రెండు రోజులుగా చేపలవేటకు వెళ్లకుండా జాలర్లు ఇంటిపట్టునే గడుపుతున్నారు. సుమారు వెయ్యి పడవలను తీరంలో లంగరేసి ఉంచారు. రామేశ్వరం, పాంబన్, ఏర్వాడి, తంగచ్చిమఠం, తొండి ప్రాంతాల్లో పెనుగాలులు వీచాయి. దీనికితోడు తీరంలో అలలు రెండు మీటర్ల ఎత్తున ఎగసిపడ్డాయి. ఈ పరిస్థితులలో జాలర్లు రెండు రోజులుగా చేపలవేటకు స్వస్తి చెప్పారు.

రూ.82.33 లక్షల విలువైన సహాయాల పంపిణీ

వేలూరు, సెప్టెంబరు 11: జిల్లాలో పాడిపరిశ్రమ అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై ఆ శాఖ మంత్రి మనోతంగరాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 126 మంది లబ్ధిదారులకు రూ.82.33 లక్షల విలువైన సంక్షేమ సహాయాలను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో పాల డైరీ అభివృద్ధి శాఖ డైరెక్టర్ వినీత్, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, ఈశ్వరప్పన్, జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, ఆవిన్ జనరల్ మేనేజర్ ఇళంగోవన్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సహాయాలు అందజేస్తున్న మంత్రి మనోతంగరాజ్

గుడియాత్తంలో 'ఉయర్వుకు పడి' కార్యక్రమం

వేలూరు, సెప్టెంబరు 11: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలో గుడియాత్తంలో 'ఉయర్వుకు పడి' కార్యక్రమం జరిగింది. 2023-24 విద్యా సంవత్సరంలో కళాశాలల్లో చేరని విద్యార్థులు, ప్లస్ టూ ఉత్తీర్ణులు కానివారు, పరీక్షలకు హాజరు కాని వారిని గుర్తించి, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి ఉన్నత విద్యలో చేరేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఆ ప్రకారం, గుడియాత్తంలోని ప్రభుత్వ మహిళా ఉన్నత పాఠశాలలో కలెక్టర్ సుబ్బులక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు విజయన్, మున్సిపాలిటీ అధ్యక్షుడు సౌందర్‌రాజన్, రెవెన్యూ తహసీల్దార్ సుబ్బలక్ష్మి, గుడియాత్తం బీడీఓ చిత్రాదేవి, జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి శీను, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి భానుమతి, గుడియాత్తం మున్సిపాలిటీ కమిషనర్ మంగైకరసన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి కళాశాల అడ్మిషన్ అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

మెదడు నిర్జీవమైన బాలుడి అవయవదానం



కిషోర్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 11: దిండుగల్‌లో మెదడు నిర్జీవమైన బాలుడి అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. దిండుగల్ జిల్లా ఒట్టాన్‌సత్రం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పళనిస్వామి కుమారుడు కిషోర్ (11) అదే ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. కిషోర్ కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్కడ చికిత్స ఫలించక కిషోర్ మెదడు నిర్జీవమైందని వైద్యులు నిర్ధారించారు. దీంతో, కుటుంబ సభ్యుల అనుమతితో కిషోర్ శరీరాన్ని దిండుగల్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించి, ప్రత్యేక శస్త్రచికిత్సద్వారా అవయవాలు తొలగించి భద్రపరిచారు. కిషోర్ భౌతిక దేహానికి జిల్లా కలెక్టర్ పూంగొడి, ఆసుపత్రి డీన్, వైద్యులు, నర్సులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

22 కిలోల గుట్కా స్వాధీనం

● ఆవడిలో 14 దుకాణాలకు సీలు

ప్యారీస్, సెప్టెంబరు 11: స్థానిక ఆవడి ప్రాంతంలో చట్టవిరుద్ధంగా గుట్కా, పొగాకు ఉత్పత్తులు విక్రయించిన 14 దుకాణాలకు అధికారులు సీలు వేశారు. ఆవడి పోలీస్ కమిషనర్ శంకర్ ఉత్తర్వుల మేరకు పోలీసు బృందాలు పూందమల్లి, తిరువేర్కాడు, తిరునిండ్రవూర్, రెడ్‌హిల్స్, ఎన్నూర్ ప్రాంతాల్లో ఉన్న చిన్న దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో 22 కిలోల గుట్కా స్వాధీనం చేసుకొని, 14 దుకాణాలకు సీలు వేశారు. మొదటి సారి పట్టుబడిన ఈ దుకాణాల యజమానుల నుంచి రూ.3.75 లక్షల జరిమానా విధించారు.

ప్రభుత్వ బస్సుల జప్తు

పెరంబూర్, సెప్టెంబరు 11: విరుదునగర్ జిల్లా కల్‌కుర్చి-అరుప్పుకోట రోడ్డులో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి రూ.39.20 లక్షల పరిహారం చెల్లించకపోవడంతో కోర్టు సిబ్బంది రెండు బస్సులను జప్తు చేశారు. మదురై జిల్లా కల్లికుడి సుందరగుండు ప్రాంతానికి చెందిన పూవేశ్వరన్ (28) గత 2019 ఆగస్టు 9న ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు పరిహారం కోరుతూ పిటిషన్ వేశారు. ఈ కేసు విచారించిన విరుదునగర్ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి టీవీ హేమానంద్, మృతుడి కుటుంబానికి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రూ.27,35,600 పరిహారం, 7.5 శాతం వడ్డీతో మొత్తం రూ.39.20 లక్షలు చెల్లించాలని 2023 అక్టోబరు 23న ఉత్తర్వులు జారీచేశారు. కోర్టు ఉత్తర్వులు పాటించలేదంటూ అప్పీలు పిటిషన్ వేశారు. న్యాయమూర్తి ఉత్తర్వులతో కోర్టు సిబ్బంది రోడ్డు రవాణా సంస్థకు చెందిన రెండు బస్సులు జప్తు చేశారు.

హెల్మెట్ ధరించండి...

● ఎంపీ కనిమొళి సలహా



హెల్మెట్ ధరించాలని యువకులకు సూచిస్తున్న ఎంపీ కనిమొళి

పెరంబూర్, సెప్టెంబరు 11: తూత్తుకుడి పార్లమెంటు నియోజకవర్గంలో విజయం సాధించిన కనిమొళి, అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ క్రమంలో, శ్రీవైకుంఠం శాసనసభ నియోజకవర్గం పరిధిలోని మంగళవారం ఆమె జీపులో ప్రయాణిస్తూ ప్రజలకు అభివాదం తెలుపుతున్నారు. ఆ సమయంలో, ఆమె వాహనానికి వెనుక పార్టీకి చెందిన యువకులు ద్విచక్రవాహనాలపై జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ అనుసరిస్తున్నారు. మధ్యలో వారు హెల్మెట్ ధరించలేదని గుర్తించిన ఎంపీ కనిమొళి, వాహనం నుంచి దిగి వారి వద్దకు వచ్చి, హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎంపీతో సెల్ఫీ తీసుకున్న కార్యకర్తలు అక్కడి నుంచి బయల్దేరారు.

విదేశాల్లోనే 1,283 మంది తమిళులు

● నగర పోలీస్ కమిషనర్ అరుణ్

ప్యారీస్, సెప్టెంబరు 11: టూరిస్ట్ వీసాలో విదేశాలకు వెళ్లిన 1,283 మంది తమిళులు స్వదేశానికి తిరిగి రాలేదని పోలీస్ కమిషనర్ అరుణ్ బుధవారం తెలిపారు. 2022 జనవరి నుంచి 2023 నవంబరు వరకు ఉపాధి కోసం టూరిస్ట్ వీసాలో చెన్నైకి చెందిన వారు కంబోడియా, థాయ్‌లాండ్, వియత్నాం తదితర దేశాలకు వెళ్లారు. అదే విధంగా గత జూన్ నెలలో కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ప్రవాస భారతీయుల సంక్షేమ మంత్రిత్వ శాఖ అనుమతితో కంబోడియా, మియన్మార్ తదితర దేశాలకు పర్యాటక వీసాలో ప్రైవేటు సంస్థలు తీసుకెళ్లినట్లు తెలిసింది. విదేశాలకు వెళ్లిన వారు ఆ దేశాల్లో చట్టాలను అతిక్రమించి ఆన్‌లైన్ యాప్ ద్వారా వ్యవహరించి పోలీసులకు పట్టుబడుతున్నారు. జైళ్లలో మగ్గుతున్న వీరిని విడిపించాలని కోరుతూ వారి బంధువులు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను విన్నవించుకున్న నేపథ్యంలో, ఇటీవల 83 మంది తమిళులను పలు దేశాల నుంచి విడిపించారు. దీనిపై గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ మాట్లాడుతూ... విదేశాల నుంచి తిరిగొచ్చిన తమిళులను విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి టూరిస్ట్ వీసాలో వెళ్లిన 1,283 మంది జాడ తెలుసుకొనేందుకు ప్రయత్నాలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

కొత్త బస్సులు ప్రారంభం



కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

వేలూరు, సెప్టెంబరు 11: వేలూరు ప్రభుత్వ రవాణా సంస్థలో రూ.1.52 కోట్లతో కొనుగోలు చేసిన నాలుగు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో విల్లుపురం రీజినల్ మేనేజర్ గణపతి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, మేయర్ సుజాత, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ కవిత తదితరులు కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సుల్లో మూడు బెంగళూరుకు, ఒకటి కేజీఎఫ్‌కు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు మణి, సెక్రటరీ రమేష్, కోశాధికారి కృష్ణన్, జనరల్ సెక్రటరీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన గాంధీ విగ్రహం

పెరంబూర్, సెప్టెంబరు 11: కన్నియాకుమారి జిల్లా కులిత్తురై సమీపం మరుందగోడు ప్రాంతంలో ఇరనియల్ సర్వోదయ సంఘానికి చెందిన ప్రాంతంలో గాంధీ విగ్రహం ఉంది. ఈ విగ్రహం తల భాగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆ ప్రాంత ప్రజల ఫిర్యాదుపై కేసు నమోదుచేసిన మార్తాండం పోలీసులు, ఈ ఘాతుకానికి పాల్పడిన అగంతకుల కోసం గాలిస్తున్నారు.

నేడు వెల్లయన్ అంత్యక్రియలు

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూసిన రాష్ట్ర వాణిజ్య సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వెల్లయన్ అంత్యక్రియలు ఆయన స్వస్థలమైన తిరుచెందూరు సమీపం పిచ్చివిలై గ్రామంలో గురువారం ఉదయం జరుగుతాయని కుటుంబీకులు ప్రకటించారు. మంగళవారం సాయంత్రం వెల్లయన్ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం పెరంబూరులోని ఆయన నివాసం వద్ద ఉంచారు. అన్నాడీఎంకే నేత డి.జయకుమార్, మాజీ మంత్రి మాఫాయ్ పాండ్యరాజన్, టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై, ఎండీఎంకే నేత దురై వైగో సీపీఐ నేత ముత్తరసన్, బీజేపీ నేత కరు నాగరాజన్, ముస్లిం లీగ్ నేత ఖాదర్‌మొయుద్దీన్ తదితరులు భౌతికకాయానికి నివాళుర్పించారు. బుధవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్.ప్రియ, టీవీకే నేత బుస్సీ ఆనంద్, మాజీ మంత్రి గోకుల ఇందిరా తదితరులు నివాళులర్పించారు. గురువారం వెల్లయన్ అంత్యక్రియలు జరుగనుండటంతో తూత్తుకుడి జిల్లాలోని దుకాణాలన్నీ మూతపడనున్నాయని వాణిజ్య సంఘాల సమాఖ్య నిర్వాహకులు ప్రకటించారు.



వేలూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట పాత పింఛన్ విధానం అమలు సహా 31 అంశాల కోర్కెల పరిష్కారానికి . దర్నా చేపట్టిన తమిళనాడు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

పండుగల సందర్భంగా ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 11: ఓనం, విజయదశమి, దీపావళి పండుగలను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● 07119 సికింద్రాబాద్-కొల్లం (గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట మీదుగా) ప్రత్యేక రైలు ఈ నెల 13వ తేది (శుక్రవారం) సికింద్రాబాద్‌లో సాయంత్రం 5.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.20 గంటలకు కొల్లం చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.07120 కొల్లం-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 15వ తేది కొల్లంలో వేకువజామున 2.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ● నెం.06071 కొచ్చువెల్లి-నిజాముద్దీన్ (సేలం, జోలార్‌పేట, చిత్తూరు, తిరుపతి, రేణిగుంట, గూడూరు మీదుగా) ప్రత్యేక రైలు ఈ నెల 20,27, అక్టోబరు 4,11,18,25, నవంబరు 1,8,15,22,29 (శుక్రవారం) కొచ్చువెల్లిలో మధ్యాహ్నం 2.15 గంటలకు బయల్దేరి మూడవ రోజు రాత్రి 8.40 గంటలకు నిజాముద్దీన్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06072 నిజాముద్దీన్-కొచ్చువెల్లి ప్రత్యేక రైలు ఈ నెల 23,30, అక్టోబరు 7,14,21,28, నవంబరు 4,11,18,25, డిసెంబరు 2 (సోమవారం) తేదీల్లో నిజాముద్దీన్‌లో తెల్లవారుజామున 4.10 గంటలకు బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 2.15 గంటలకు కొచ్చువెల్లి చేరుకుంటుంది.

● నెం.06077 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి (గూడూరు, నెల్లూరు, ఒంగోలు మీదుగా) ప్రత్యేక రైలు ఈ నెల 21,28, అక్టోబరు 5,12,19,26, నవంబరు 2,9,16,23,30 డిసెంబరు 2వ తేదీల్లో చెన్నై సెంట్రల్‌లో రాత్రి 11.45 గంటలకు బయల్దేరి మూడో రోజు ఉదయం 7.15 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06078 సంత్రాగచ్చి-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 23,30, అక్టోబరు 7,14,21,28, అక్టోబరు 4,11,18,25, డిసెంబరు 2వ తేదీల్లో సంత్రాగచ్చిలో ఉదయం 10 గంటలకు బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలిపింది.

క్రైమ్ కార్నర్

CRIME CORNER

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

● ఇద్దరు ఉపాధ్యాయులపై వేటు

పెరంబూర్, సెప్టెంబరు 11: తిరునల్వేలి జిల్లాలోని ఓ ఎయిడెడ్ పాఠశాలలో 7వ తరగతి విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరు ఉపాధ్యాయులపై జిల్లా విద్యా శాఖ చర్యలు చేపట్టింది. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా, పోలీసులు, జిల్లా విద్యా శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తాత్కాలిక ఉపాధ్యాయుడు నెల్సన్‌ను విధుల నుంచి తొలగించగా, ఉపాధ్యాయుడు రాబర్ట్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ప్రధాన విద్యాధికారి శివకుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

ఎయిర్‌పోర్ట్‌లో 30 మందికి జరిమానా

ఐసిఎఫ్, సెప్టెంబరు 11: చెన్నై విమానాశ్రయంలో 30 మంది ప్రయాణికులకు కస్టమ్స్ అధికారులు జరిమానా విధించారు. శ్రీలంక రాజధాని కొలంబో నుంచి చెన్నైకి మంగళవారం ప్రైవేటు ప్యాసింజర్ విమానం వచ్చింది. అందులో ఉన్న ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీచేయగా, కొందరు విలువైన మొబైల్ ఫోన్లు, మద్యం సీసాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తేవడం గుర్తించారు. ఆ వస్తువులకు పన్ను చెల్లించకపోవడంతో 30 మంది ప్రయాణికులకు రూ.10 లక్షల జరిమానా విధించారు.

10వ తరగతి విద్యార్థి బ్యాగులో కత్తి

పెరంబూర్, సెప్టెంబరు 11: తిరునల్వేలి జిల్లా తాళైయుత్తు ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థి స్కూల్ బ్యాగులో కత్తి ఉండడం కలకలం రేపింది. బుధవారం ఉదయం తరగతి గదిలో ఉపాధ్యాయుడు విద్యార్థుల బ్యాగులు తనిఖీ చేస్తున్న సమయంలో, సదరు విద్యార్థి బ్యాగులో కత్తి కనిపించింది. సహచర విద్యార్థులతో ఏర్పడిన తగాదా కారణంగా, కత్తి తీసుకొచ్చినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. విచారణ అనంతరం కత్తి తీసుకొచ్చిన విద్యార్థి సహా ముగ్గురు బాలురను జువైనల్ హోంకు తరలించారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్... విద్యార్థుల అరెస్ట్

ప్యారీస్, సెప్టెంబరు 11: స్థానిక నందనంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థుల గుర్తింపుకార్డును కాళ్లతో తొక్కుతున్నట్లు తీసిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన న్యూ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులను థౌజండ్ లైట్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత వారం అన్నాసాలై ఆనంద్ థియేటర్ సమీపంలో నందనం ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, రాయపేటలో ఉన్న న్యూ కళాశాల విద్యార్థులు ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకుంటూ పరస్పరదాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనపై థౌజండ్ లైట్స్ పోలీసులు ఆ విద్యార్థులపై కేసు నమోదుచేసి నందనం కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులను అరెస్ట్ చేశారు. వారిని విచారించే సమయంలో న్యూ కళాశాల విద్యార్థుల ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ వెలుగుచూసింది. దీంతో ఈ చర్యలకు పాల్పడిన న్యూ కళాశాల విద్యార్థులు ఐదుగురిని మంగళవారం అరెస్ట్ చేశారు.

ప్రభుత్వ బస్సు డ్రైవర్‌పై దాడి

● లా విద్యార్థిని సహా నలుగురి అరెస్ట్

ప్యారీస్, సెప్టెంబరు 11: స్థానిక క్రోంపేటలో ప్రభుత్వ బస్సు డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వ్యవహారంలో లా కళాశాల విద్యార్థిని సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువాన్మియూర్ నుంచి క్రోంపేటకు వెళ్తున్న ఎంటీసీ బస్సు క్రోంపేట ప్రాంతంలోని శరవణ స్టోర్ సమీపంలో ఆగి ఉన్న కారు పక్కనే ఆగింది. దీంతో బస్సు డ్రైవర్ అశోక్‌కుమార్ హారన్ మోగించి కారు పక్కకు తీసుకెళ్లాలంటూ కోరారు. దీంతో కారు యజమాని తనతో ఉన్న మరో ముగ్గురితో కలసి బస్సు డ్రైవర్ చితకబాదారు. దీనిపై బాధితుడు అందజేసిన ఫిర్యాదును కేసుగా నమోదుచేసిన పోలీసులు, లా కళాశాల విద్యార్థిని ప్రదీపాశాలిని, ఆమె భర్త రంజిత్, సోదరుడు అశ్వత్ కుమార్, రంజిత్ సోదరుడు దిలీప్‌కుమార్‌లను అరెస్ట్ చేశారు.

పోలీసు కస్టడీలో ప్రవచనకర్త మహావిష్ణు

ప్యారీస్, సెప్టెంబరు 11: దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడిన వ్యవహారంలో ప్రవచనకర్త మహావిష్ణును మూడు రోజులు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ సైదాపేట కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. సైదాపేట ప్రభుత్వ మోడల్ మహోన్నత పాఠశాలలో గత 28వ తేది ఏర్పాటుచేసిన ప్రవచన కార్యక్రమంలో తిరుప్పూర్‌కు చెందిన పరంపొరుల్ ఫౌండేషన్ ప్రవచనకర్త మహావిష్ణు ప్రసంగించారు. ఆ సందర్భంగా పూర్వ జన్మలో పాపాలు చేసినందునే దివ్యాంగులుగా జన్మించారని ప్రసంగించారు. ఈ ప్రసంగం సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో మహావిష్ణుకు వ్యతిరేకంగా ఫిర్యాదులు రావడంతో పోలీసులు కేసు నమోదుచేసి అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించారు. జైలు నుంచి బుధవారం సైదాపేట కోర్టులో హాజరుపరచగా, మహావిష్ణుకు మూడు రోజుల పోలీసు కస్టడీ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

మద్యం మత్తులో ఇద్దరిపై దాడి

● మనో కుమారుడి సహా ఐదుగురిపై ఫిర్యాదు

ప్యారీస్, సెప్టెంబరు 11: మద్యం మత్తులో ఇద్దరిపై దాడికి పాల్పడ్డారని సినీ నేపథ్యగాయకుడు మనో కుమారుడు సహా ఐదుగురిపై వలసరవాక్కం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. మధురవాయల్ సమీపంలోని ఆలపాక్కంకు చెందిన కృపాకరన్, మధురవాయల్‌కు చెందిన 16 ఏళ్ల బాలుడు వలసరవాక్కం శ్రీదేవి కుప్పం ప్రాంతంలో ఉన్న ఫుట్‌బాల్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణలో పాల్గొంటున్నారు. రోజులాగే వారు మంగళవారం రాత్రి శిక్షణ ముగించుకొని ఆ ప్రాంతంలో ఉన్న హోటల్‌లో పార్శిల్ తీసుకొనేందుకు వెళ్లగా, అక్కడ మద్యం మత్తులో ఉన్న మనో కుమారుడు సహా ఐదుగురు దాడిచేసినట్లు తెలిసింది. గాయపడిన ఇద్దరు కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు వలసరవాక్కం పోలీసులు మనో కుమారుడు రఫీ సహా ఐదుగురిపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

తిరువళ్లూరు ఆస్పత్రిలో మద్యం మత్తులో నిద్రపోయిన డాక్టర్



మత్తులో జోగుతున్న డాక్టర్ నల్లతంబి

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు ప్రభుత్వ ఆస్పత్రి అత్యవసర విభాగంలో మంగళవారం రాత్రి డ్యూటీ డాక్టర్ నల్లతంబి పీకలదాకా మద్యం తాగి గుర్రుపెట్టి నిద్రపోయారు. ఆ ఆస్పత్రిలో ఐదువందలకు పైగా రోగులు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి అత్యవసర చికిత్సా విభాగంలో డ్యూటీకి వెళ్లిన డాక్టర్ నల్లతంబి మద్యం మత్తులో రోగుల వెంట ఉండే వారిని దుర్భాషలాడి తరిమికొట్టారు. ఆ తర్వాత ఆసుపత్రి బయట ఉన్న తిన్నెపై నిద్రపోయారు. అది చూసిన సిబ్బంది ఆ డాక్టర్‌ను వాచ్‌మేన్ గదిలో పడుకోబెట్టారు. బుధవారం వేకువజాము స్పృహలోకి వచ్చిన డాక్టర్ తాను వాచ్‌మేన్ గదిలో పడుకున్నట్లు తెలుసుకుని అక్కడి నుంచి నడచుకుంటూ ఇంటికి వెళ్లారు. ఈ విషయం తెలియగానే రోగులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీన్ రేవతికి పలువురు ఫిర్యాదు చేశారు. దీనితో మద్యం మత్తులో డ్యూటీ చేయకుండా నిద్రపోయిన డాక్టర్ నల్లతంబిపై చర్యలు తీసుకుంటామని డీన్ రేవతి ప్రకటించారు.


చవితి వేడుకల్లో ఇరువర్గాల ఘర్షణ

● ధ్వంసమైన విగ్రహం



ధ్వంసమైన వినాయక విగ్రహం

పెరంబూర్, సెప్టెంబరు 11: కళ్లకుర్చి జిల్లా ఉళుం దూర్‌పేట సమీపంలో వినాయక చవితి వేడుకల్లో రెండు సామాజిక వర్గాలు బాహాబాహీకి దిగాయి. కిళక్కుమరుదూర్ గ్రామంలో వినాయక చవితి సందర్భంగా బ్యానర్లు ఏర్పాటు వ్యవహారంలో రెండు వర్గాల మధ్య వాగ్వివాదం చెలరేగింది. పెద్దల జోక్యంతో అప్పటికి సద్దుమణిగింది. ఈ నేపథ్యంలో, మంగళవారం జరిగిన నిమజ్జన కార్యక్రమంలో మళ్లీ ఇరువర్గాలు ఘర్షణలకు దిగారు. ఈ ఘటనలో వినాయక విగ్రహానికున్న తల కిందపడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి, ఇరువర్గాలకు చెందిన 62 మందిపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.


'థగ్‌లైఫ్'లో కమల్ హాసన్

తుది దశకు చేరుకున్న 'థగ్‌లైఫ్' షూటింగ్

మణిరత్నం - కమల్ హాసన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'థగ్‌లైఫ్' సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. వీలైనంత త్వరగా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేయాలన్న సంకల్పంతో చిత్ర బృందం రేయింబవళ్ళు శ్రమిస్తోంది. చాలా గ్యాప్ తర్వాత కమల్ - మణిరత్నం కలిసి పని చేస్తున్న ఈ చిత్రంలో సిలంబరసన్, అశోక్ సెల్వన్, త్రిష, ఐశ్వర్య లక్ష్మీ తదితరులు నటిస్తున్నారు. రెడ్ జెయింట్ మూవీస్, రాజ్ కమల్ ఇంటర్నేషనల్ ఫిలిమ్స్, మద్రాస్ టాకీస్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నాయి. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని చెన్నై, రాజస్థాన్, ఢిల్లీ, పుదుచ్చేరి, గోవా తదితర ప్రాంతాల్లో షూటింగ్ జరిపారు. ఇప్పటికే కమల్ హాసన్‌కు సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేయగా, ఇపుడు శింబు, అశోక్ సెల్వన్, త్రిషపై సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. వీటిని ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేసి, ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు చేపట్టాలని చిత్ర యూనిట్ భావిస్తుంది.

'సర్' మూవీ రిలీజ్ చేయనున్న రోమియో పిక్చర్స్

అగ్రహీరో విజయ్ నటించిన 'ది గోట్' చిత్రాన్ని విడుదల చేసిన రోమియో పిక్చర్స్ ఇపుడు 'సర్' చిత్రం విడుదల హక్కులను సొంతం చేసుకుంది. ఎస్ఎస్ఎస్ పిక్చర్స్ పతాకంపై శివరాజ్.ఎస్ నిర్మాణ సారథ్యంలో దర్శకుడు వెంకట్ బోస్ రూపొందించిన చిత్రం 'సర్'. విమల్ హీరోగా నటించగా, ఒక సమాజిక స్పృహతో రూపొందించారు. ఈ సినిమా తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేసే హక్కులను రోమియో పిక్చర్స్ సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని ఆ సంస్థ అధికారికంగా వెల్లడించింది. 'కన్ని మడం' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు పొందిన బోస్ వెంకట్ హీరో విమల్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ స్క్రిప్టు సిద్ధం చేసి, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా, మంచి సందేశంతో కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి రూపొందించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెలాఖరులో సినిమా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.


శివరాజ్, వెంకట్ బోస్ తదితరులు


విజయ్ - సిమ్రన్

మరోమారు హిట్ కాంబో !!

ప్రముఖ నటుడు విజయ్ - సీనియర్ నటి సిమ్రన్ మరోమారు వెండి తెరపై సందడి చేయనున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన పలు చిత్రాలు సూపర్ హిట్ సాధించాయి. ఇపుడు మరోమారు వీరిద్దరు కలిసి ఒక చిత్రంలో నటించనున్నారు. విజయ్ హీరోగా నటించిన 'ది గోట్' ఇటీవల విడుదలై భారీ విజయాన్ని సాధించింది. ఆ తర్వాత విజయ్ 69వ చిత్రంలో నటించనున్నారు. ఇందులో విజయ్ సరసన మలయాళ నటి మమిత బైజును హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు వార్తలు వస్తున్నాయి. ఇపుడు ఇదే సినిమాలో సిమ్రన్ ఒక ముఖ్య పాత్ర పోషించనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. కాగా, గతంలో విజయ్ - సిమ్రన్ జోడీగా 'వన్స్‌మోర్', 'తుల్లాద మనముం తుల్లుమ్', 'ప్రియమానవలే', 'యూత్' వంటి చిత్రాల్లో నటించారు. సుదీర్ఘకాలం తర్వాత మరోమారు కలిసి నటించనున్నారు. కాగా, ఇటీవల ప్రశాంత్ 'అంధగన్' చిత్రంలో సిమ్రాన్ విల్లి పాత్రలో ప్రేక్షకులను అలరించిన విషయం తెల్సిందే.


'దిల్‌రాజా'లో విజయ్ సత్య

విడుదలకు సిద్ధమైన విజయ్ సత్య 'దిల్‌రాజా'

చిత్రజ్యోతి

సూపర్‌స్టార్ రజనీకాంత్ వీరాభిమానిగా విజయ్ సత్య నటించిన 'దిల్‌రాజా' చిత్రం విడుదలకు సిద్ధమైంది. పీవీఆర్ ఐనాక్స్ ఈ సినిమాను రాష్ట్ర వ్యాప్తంగా రిలీజ్ చేయనుంది. కోయంబత్తూరుకు చెందిన గోల్డెన్ ఈగల్ స్టూడియో ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించింది. విజయ్ సత్యతో హీరోయిన్ షెరిన్, వనిత, ఇమాన్ అన్నాచ్చి, సంయుక్త, కరాటే రాజా, విజయ్ టీవీ బాల, రంగనాథన్, లొల్లు సభ తదితరులు నటించగా, ఏ.వెంకటేష్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా కోసం హీరో విజయ్ సత్య సిక్స్ ప్యాక్‌తో కనిపిస్తారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, థ్రిల్లర్ యాక్షన్ మేళవింపుతో వైవిధ్యభరితంగా రూపొందిస్తున్నాం. చిత్రీకరణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ సినిమా అనంతరం విజయ్ సత్యకు మంచి భవిష్యత్ ఉంటుంది. అమ్రీష్ సంగీతం సినిమాకు హైలెట్‌గా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన పాటకు మంచి స్పందన లభించింది' అని వివరించారు.



త్యాగశీలి ఇమ్మానువేల్ శేఖరన్

● మంత్రి ఉదయనిధి సహా నేతల నివాళి

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, త్యాగశీలి ఇమ్మానువేల్ శేఖరన్ 67 వర్థంతి సందర్భంగా రాష్ట్ర మంత్రి ఉదయనిధి సహా వివిధ రాజకీయ పార్టీల నేతలు బుధవారం ఉదయం ఘన నివాళులర్పించారు. రామనాథపురం జిల్లా పరమక్కుడిలో ఉన్న స్మారక స్థలం వద్ద ఉదయనిధి, డీఎంకే ఎమ్మెల్యేలు పుష్ప గుచ్ఛాలుంచి నివాళులర్పించారు. ఆ తర్వాత అన్నాడీఎంకే తరఫున మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్, పార్టీ ప్రముఖులు రాజలక్ష్మి, అన్వర్ రాజా, మణికంఠన్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. అదేవిధంగా మాజీ ముఖ్యమంత్రి ఓపన్నీర్‌సెల్వం ఆయన అనుచరులు, అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై, నామ్ తమిళర్ కట్చి నేత శీమాన్, డీఎండీకే తరఫున విజయ్ ప్రభాకరన్, ఎండీఎంకే, బీజేపీ ప్రముఖులు దివంగత సమరయోధుడికి ఘననివాళులు సమర్పించారు.

సమరయోధుడు ఇమ్మానువేల్ శేఖరన్ స్మారక స్థలం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్ తదితరులు


గిండి రాజ్‌భవన్‌లో తమిళ మహాకవి భారతియార్ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

మెరీనాబీచ్‌లో పార్కింగ్‌కు డిజిటల్ టోకెన్లు

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మెరీనా బీచ్‌లో వాహనాల పార్కింగ్‌కు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఆ మేరకు నగరంలోని బిజినెస్ మాల్స్ వద్ద వాహనాల పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లే డిజిటల్ విధానంలో బీచ్‌కు వచ్చే వాహనాలకు పార్కింగ్ ఫీజు టోకెన్లు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ డిజిటల్ పార్కింగ్ రుసుము వసూళ్ల కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆటోమేటిక్ విధానంలో బారికేడ్లను ఏర్పాటు చేస్తారు. అన్నా సమాధి నుంచి, లైట్‌హౌస్ వరకు సర్వీస్ రోడ్డు పొడవునా నాలుగు చోట్ల వాహనాల కోసం ప్రత్యేక గేట్లు ఏర్పాటు చేస్తారు. తొలుత ఈ గేట్ల వద్ద డిజిటల్ విధానంలో పార్కింగ్ కోసం గంటకు కొంత మొత్తాన్ని ఫీజుగా నిర్ణయించి టోకెన్లు ఇస్తారు. ఆ టోకెన్ చూపగానే గేట్ బారికేడ్ తెరచుకుని వాహనం లోపలకు తీసుకెళ్లేందుకు వీలవుతుంది. వాహన చోధకులు తిరిగి వెళ్లేటప్పుడు గంటకు మించి పార్కింగ్ చేసి ఉన్నట్లయితే అదనంగా ఫీజు చెల్లించిన మీదటే తమ వాహనాలను బయటకు తీసుకెళ్లటానికి వీలవుతుంది.అదే సమయంలో పార్కింగ్ ప్రాంతాల్లో కార్లు, బైకులు పార్కింగ్ చేయడానికి స్థలం కొరత ఉన్నట్లయితే ఆ సమాచారాన్ని డిజిటల్ ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రదర్శిస్తారు. ఈ విషయమై మేయర్‌ఆర్ ప్రియా మాట్లాడుతూ మెరీనాబీచ్‌లో సెన్సార్ పద్ధతిన వాహనాల పార్కింగ్ నిర్వహించే యోచన కూడా ఉందన్నారు.


బీచ్ సర్వీసు రోడ్డులో బారులు తీరిన వాహనాలు


చెన్నై మెరీనాబీచ్ వద్ద తమిళమహాకవి భారతియార్ వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు సామినాథన్, పీకే శేఖర్‌బాబు, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, పారిశ్రామికవేత్త వీజీ సంతోషం తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

క్షత్రియుల అభివృద్ధికి కృషి

● క్షత్రియ సేవా సమితి

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్షత్రియుల అభివృద్ధికి, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయనున్నట్లు క్షత్రియ సేవా సమితి (గ్లోబల్) మేనేజింగ్ ట్రస్టీలు శోభ రాజా, శంకర రాజా, దేవరకొండ రాజు తెలిపారు. అశోక్‌నగర్‌లోని కాశి ఎస్టేట్‌లో ఇటీవల మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి, క్షత్రియ కుటుంబాల ఆత్మీయ కలయిక జరిగాయి. శోభ రాజా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన కేటీ రామరాజు, డి.సత్యరాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శోభరాజా మాట్లాడుతూ.. క్షత్రియ సేవా సమితి ద్వారా నగరంలో వున్న క్షత్రియ కుటుంబాలను ఏకతాటిపైకి తీసుకువస్తామన్నారు. అదేవిధంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా, సంప్రదాయం ఈ తరం చిన్నారులకు తెలిసేలా సంక్రాంతి, ఉగాది తదితర పండుగలను నిర్వహిస్తామన్నారు. పీవీ శంకరరాజా, దేవరకొండ రాజు మాట్లాడుతూ.. క్షత్రియ కుటుంబాల కోసం వివాహ వేదిక, వ్యాపార సలహాలు, న్యాయ సలహాలు, విద్యవైద్య తదితరాంశాలపై సలహాలు, సూచనలు అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని వివరించారు.

ఆదాయంలో చెన్నై సెంట్రల్ తృతీయ స్థానం



ఐసిఎఫ్, సెప్టెంబరు 11: దేశంలో అత్యధిక ఆదాయం కలిగిన రైల్వేస్టేషన్లలో చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ తృతీయ స్థానం సంపాదించుకుంది. దేశంలో అధిక ఆదాయం, రాబడి కలిగిన, అత్యధిక సంఖ్యలో ప్రయాణికులకు సేవలందిస్తున్న రైల్వేస్టేషన్ల జాబితాను రైల్వే బోర్డు విడుదల చేసింది. ఆ ప్రకారం, న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ 3.93 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలతో రూ.3,337 కోట్ల ఆదాయంతో మొదటి స్థానంలో ఉంది. హౌరా రైల్వేస్టేషన్ 6.13 కోట్ల మంది ప్రయాణికులతో రూ.1,692 కోట్ల ఆదాయం పొందుతూ ద్వితీయస్థానంలో ఉంది. ఇక, చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ 3.05 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందిస్తూ రూ.1,299 కోట్ల ఆదాయంతో తృతీయ స్థానంలో నిలిచింది. అదేవిధంగా తెలంగాణా రాష్ట్రం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 2.77 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందిస్తూ రూ.1,276 కోట్ల ఆదాయంతో నాలుగో స్థానంలో నిలిచింది.


చెన్నై తరమణి ఎంజీఆర్ ఫిల్మ్‌సిటీ పునర్నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న రాష్ట్ర సమాచార శాఖ మంత్రి సామినాథన్, శాఖ కార్యదర్శి రాజారామన్, ఫిల్మ్‌సిటీ సినీ, టీవీ శిక్షణా సంస్థ అధ్యక్షుడు, నటుడు రాజేష్ తదితరులు

ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండండి

● విద్యార్థులకు సీఎస్ మురుగానందం సూచన

ప్యారీస్, సెప్టెంబరు 11: ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస కాకుండా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నతవంతులుగా ఎదగాలని పాఠశాల, కళాశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం హితవు పలికారు. స్థానిక రాజా అన్నామలై పురంలో తమిళనాడు ఆన్‌లైన్ క్రీడా కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో సీఎస్ మురుగానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హోంశాఖ కార్యదర్శి ధీరజ్‌కుమార్, ఆన్‌లైన్ క్రీడల విభాగం డైరెక్టర్ నసీముద్దీన్ సహా పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆన్‌లైన్ గేమ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించే విధంగా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి సీఎస్ మాట్లాడారు. అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీని సమాజాభివృద్ధి కోసం విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. తల్లిదండ్రులు సెల్‌ఫోన్‌కు అలవాటు పడిన తమ పిల్లలను బుజ్జగింపు ధోరణిలో మందలించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధిలో యువకులు, విద్యార్థులు సమష్టిగా కృషిచేయాలని సీఎస్ పిలుపునిచ్చారు.


సదస్సును ప్రారంభిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం

మదురై విమానాశ్రయంలో 24 గంటల సేవలు



మదురై విమానాశ్రయం

ఐసిఎఫ్, సెప్టెంబరు 11: మదురై విమానాశ్రయంలో అక్టోబరు నుంచి 24 గంటలు సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ విమానాశ్రయంలో ప్రస్తుతం ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే విమానాలు నడుస్తున్నాయి. విదేశీ విమానాల తగ్గింపు, సిబ్బంది కొరతతో ప్రస్తుతం సమయాన్ని కుదించారు. ఈ నేపథ్యంలో, నైట్ సర్వీస్ ప్రారంభించేందుకు ముందుకు రావాలని విమాన సంస్థలను ఆహ్వానించారు.. దీంతో మదురై విమానాశ్రయంలో అక్టోబరు నుంచి 24 గంటలు విమాన సేవలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

స్మార్ట్ టెక్నాలజీ సేవల విస్తరణ

ప్యారీస్, సెప్టెంబరు 11: కెనడాకు చెందిన స్మార్ట్ టెక్నాలజీస్ సంస్థ తన సేవల విస్తరించే పథకంలో భాగంగా బుధవారం నగరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. బీసెంట్ నగర్‌లోని సురానా హైటెక్ ఇంటర్నేషనల్ పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో స్మార్ట్ బోర్డు ఎంఎక్స్ సిరీస్, స్మార్ట్ బోర్డు సీఎక్స్ సిరీస్ ఇంటరాక్టివ్ డిస్‌ప్లేలను సంస్థ సీఈఓ నికోల్స్ వెల్సన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ జెఫ్లోవ్ మీడియాతో మాట్లాడుతూ... విద్యా సాంకేతికత ద్వారా సానుకూల అధ్యయన ఫలితాలందించే సంస్థల్లో ప్రపంచంలోనే 35వదిగా స్మార్ట్ టెక్నాలజీస్ ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు. భారత దేశంలో విద్యారంగాన్ని ఆధునీకరణ చేసే విధంగా రూపొందించిన రెండు ఇంటరాక్టివ్ డిస్‌ప్లేలను విడుదల చేశామని, వీటి ద్వారా మిలియన్ల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉన్నత శ్రేణి విద్య అందించగలమని ఆయన తెలిపారు.


ఇంటరాక్టివ్ డిస్‌ప్లే ఆవిష్కరిస్తున్న స్మార్ట్ టెక్నాలజీ అధికారులు నికోల్స్ వెన్సన్, జెఫ్లోవ్ తదితరులు



మలయాళీయులు కోలాహలంగా జరుపుకోనున్న ఓనం పండుగను ఆహ్వానిస్తూ బుధవారం అత్తిపూల రంగవల్లికల వద్ద సందడి చేస్తున్న చెన్నై జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల విద్యార్థినులు


చెన్నై పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా ఫిర్యాదును స్వీకరించి వివరాలు తెలుసుకుంటున్న నగర పోలీసు కమిషనర్ ఎ. అరుణ్